సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



నేత్రపర్వంగా వెంకన్న పెళ్లి రాట

ఉపమాక వేంకటేశ్వర స్వామివారి వార్షిక తిరుకల్యాణోత్సవాల పెళ్లిరాట కార్యక్రమం నేత్రపర్వంగా నిర్వహించారు. 8లో



ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. 8లో

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



విశాఖ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

పాపికొండలకు పర్యాటకుల తాకిడి



పోచవరం బోట్ పాయింట్ వద్ద పర్యాటకుల సందడి

వీఆర్‌పురం: పాపికొండలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం పోచవరం బోట్ పాయింట్‌కు అధిక సంఖ్యలో తరలివచ్చారు . ఎనిమిది బోట్లలో 430 మందికి పైగా పర్యాటకులు పాపికొండల వీక్షణకు వెళ్లారని ఏపీ టూరిజం కౌంటర్ అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ రాజేష్ తెలిపారు. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో బోటింగ్ పాయింట్, పేరంటాలపల్లి శివాలయం ప్రాంతాల్లో సందడి నెలకొంది.

వైవీ సుబ్బారెడ్డికి అభినందనలు



వైవీ సుబ్బారెడ్డికి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని అరకు ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు చెట్టి పాల్గుణ, పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదివారం విశాఖలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను వారు సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలీప్, అరకులోయ సచివాలయాల కన్వీనర్ పట్టాసి సంపత్ పాల్గొన్నారు.

మన్యంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- చుర్రుమనిపిస్తున్న భానుడు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. పొగమంచు కురుస్తున్నా చలిగాలులు తీవ్రత తగ్గింది. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 17 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు కార్యాలయాల్లో 15 డిగ్రీల చొప్పున ఆదివారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సూర్యోదయం కూడా వేగంగానే అయ్యింది.అయితే మధ్యాహ్నం 3గంటల వరకు ఎండతీవ్రత నెలకొంది. రోడ్డు పక్కన చిరువ్యాపారులు గొడుగులను ఆశ్రయించారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి



మొక్కుకుంటున్న జస్టిస్ జ్యోతిర్మయి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు అంతరాలయంలో అష్టోత్తరంపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో పాలూరి నరసింగరావు అందజేశారు.

28న జాబ్‌మేళా

కంచరపాలెం : జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. అపోలో ఫార్మసీ, ఎస్ఆర్ అకాడమిక్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థల్లో 130 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామన్నారు. రిటైల్ ట్రైనీ, ఆఫీస్ అడ్మిన్, టెలికాలర్, హోమ్‌కేర్, నర్సింగ్ స్టాఫ్, వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఎం/బి/డి ఫార్మసీ, ఎంఎల్‌టీ, జీఎన్ఎం, నర్సింగ్ ఉద్యోగాల బట్టీ ఉత్తీర్ణత సాధించిన 18–30 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంల్లో జాబ్ లోకేషన్ ఉంటుందన్నారు. ఆయా ఉద్యోగం బట్టి జీతం నెలకు రూ.10,500 –20 వేలు ఉంటుందన్నారు.

ఆసరా వెలుగులు

గత టీడీపీ ప్రభుత్వంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు మాటతప్పడంతో మహిళలు నిరాశకు గురయ్యారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారికిచ్చిన మాట ప్రకారం నాలుగు విడతలుగా రుణ మాఫీ చేశారు. దీంతో జిల్లాలోని 8,542 గ్రూపులకు చెందిన 83,961 మహిళలకు నాలుగు విడతల్లో 135.08 కోట్ల మేర లబ్ధి చేకూరింది.



రూ.80 వేల మేర ఆర్థిక లబ్ధి

ఎటపాక మండలం ఎటపాకకు చెందిన ఈమె పేరు కొండిపాటి లక్ష్మీప్రసన్న. సంకీర్తన డ్వాక్రా సంఘంలో సభ్యురాలు. డ్వాక్రా రుణంతో పాటు స్త్రీనిధి ద్వారా రుణం తీసుకున్న ఈమె కోళ్ల ఫారం నిర్వహిస్తూ ఆదాయం పొందుతున్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో ఏడాదికి రూ. 20 వేల చొప్పున రుణమాఫీ కావడంతో నాలుగు విడతల్లో రూ.80 వేల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరింది. రుణమాఫీ సొమ్మును కోళ్లఫారంలో అదనపు ఆదాయం సమకూరేందుకు పెట్టుబడిగా ఉపయోగించినట్టు ఆమె తెలిపింది.

- డ్వాక్రా రుణమాఫీతో ఆర్థిక ప్రయోజనం
- 8,642 గ్రూపులకు నాలుగు విడతల్లో రూ.135.08 కోట్ల మేర లబ్ధి
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్



వైఎస్సార్ ఆసరా రుణాలపై చర్చించుకుంటున్న డ్వాక్రా గ్రూపు సభ్యులు

చింతూరు: మహిళా సాధికారత, స్వావలంబనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని మహిళలకు అండగా నిలుస్తూ వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు చేయూత అందిస్తున్నారు. ప్రతిపక్ష నేతగా డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీని అధికారంలోకి రాగానే అమలు చేసి మాటతప్పని నైజం తనదని ఆయన మరోసారి నిరూపించారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణమాఫీని అమలు చేసి మహిళా పక్షపాతిగా నిలిచారు. తమకిచ్చిన హామీ మేరకు రుణాలు మాఫీ చేయడంపై డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు విడతల్లో..

జిల్లాలోని 8,542 గ్రూపులకు చెందిన 83,961 మంది డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో రూ 135.8 కోట్ల మేర వైఎస్సార్ ఆసరా నగదు జమ అయింది. ఒక్కో మహిళ ఖాతాలో ఒక్కో విడతలో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ప్రభుత్వం జమచేసింది.



వైఎస్సార్ ఆసరా నిమిత్తం డ్వాక్రా గ్రూపు సభ్యులకు బయోమెట్రిక్ చేస్తున్న సిబ్బంది

జిల్లాలోని ప్రజా ప్రతినిధులు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ఉత్సాహంగా పాల్గొని డ్వాక్రా మహిళలకు చెక్కులు అందజేశారు.

తీరిన ఆర్థిక ఇబ్బందులు

ఇచ్చిన మాట ప్రకారం రుణాలు మాఫీ చేయడంపై డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు విడతల్లో తమ ఖాతాల్లో రుణమాఫీ నగదు జమ అయిందని, వాటిని వ్యాపారాభివృద్ధితో పాటు కుటుంబ అవసరాలకు వినియోగిస్తున్నట్టు తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందని వారు పేర్కొంటున్నారు.



పాడి పరిశ్రమతో ఆదాయం

ఎటపాక మండలం గుండాలకు చెందిన ఈమె పేరు తాటి నాగమణి. శ్వేతా డ్వాక్రాసంఘంలో సభ్యురాలు. స్త్రీనిధి పథకం ద్వారా రుణం తీసుకున్న ఈమె పాడిగేదెల పెంపకం చేపట్టి మంచి ఆదాయం పొందుతున్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా ఒక్కో విడతలో రూ.16 వేల చొప్పున నాలుగు విడతల్లో రూ.64 వేలు రుణమాఫీ అయింది. ఈ మొత్తాన్ని వ్యాపార పెట్టుబడికి, ఇంటి అవసరాలకు వినియోగించుకున్నట్టు ఆమె తెలిపింది.

ఎంతో ఉపయోగం



వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా నాలుగు విడతల్లో రూ 37,500 రుణమాఫీ జరిగింది. రుణమాఫీ ద్వారా వచ్చిన సొమ్ములు కుటుంబ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీని నెరవేర్చిన జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– సోడె బాయమ్మ, చింతూరు మండలం

వ్యాపారాల్లో పెట్టుబడితో లబ్ధి



వైఎస్సార్ ఆసరా ద్వారా రుణాల మాఫీతో డ్వాక్రా మహిళలకు అదనపు ఆదాయం సమకూరింది. రుణమాఫీ ద్వారా వచ్చిన సొమ్ములతో వారు తమ వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టి లాభాలు గడిస్తున్నారు. కొంతమంది తమ కుటుంబ అవసరాలకు ఆ సొమ్ములను వినియోగిస్తున్నారు.

– వి.మురళి, డీఆర్‌డీఏ పీడీ, పాడేరు

ఆశ్రమ, గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు



నిల్వ నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశం



అన్నంను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కొయ్యూరు: జిల్లాలో అన్ని ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా పీహెచ్‌సీ వైద్యాధికారులకు ఆదేశాలిచ్చామని డీఎంహెచ్‌వో జమల్‌బాషా వెల్లడించారు. ఆదివారం ఆయన కొయ్యూరు గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. కడుపునొప్పితో బాధపడుతున్న విద్యార్థిని పరీక్షించారు. అనంతరం వంటకాలను పరిశీలించారు. తాగు నీటిని మరోసారి పరీక్ష చేయిస్తామన్నారు. మరుగుదొడ్లను పరిశీలించారు. నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియాతోపాటు మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేస్తారన్నారు.

2.13 లక్షల మందికి సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు

జిల్లాలో ఇప్పటివరకు 2.13 లక్షల మందికి సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించామని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వీరిలో 1,88,644 మందికి నెగిటివ్ వచ్చిందన్నారు. 8,558 మందికి తక్కువగా ఉందన్నారు. 1034 మందికి వ్యాధి ఉన్నట్టుగా ప్రాథమిక పరీక్షల్లో తేలిందన్నారు. రెండో దశలో నిర్ధారణ అయిన తరువాత వైఎస్సార్ పింఛను మంజూరుకు సిఫార్సు చేస్తామన్నారు. జిల్లాలో 800 మందికి నెలకు రూ.10 వేల చొప్పున వైఎస్సార్ పింఛన్ ఇస్తున్నామన్నారు. ఇంకా జిల్లాలో 2.45 లక్షల మందికి పరీక్షలు చేయాల్సి ఉందన్నారు. పూర్తయిన అనంతరం వివరాలను ఐటీడీఏ పీవోకు నివేదిస్తామన్నారు. వైద్యాధికారి మనోజ్ఞ, మలేరియా సబ్ యూనిట్ అధికారి నీలకంఠం నాయుడు, ఏఎంవో సత్యనారాయణ, సీహెచ్‌వో ప్రశాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గురుకుల విద్యార్థి మృతి



కొయ్యూరు: అనారోగ్యంతో బాధపడుతున్న గురుకుల పాఠశాల విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అత్యవసర వైద్యం అందించి ప్రాణాలు కాపాడేందుకు పాఠశాల ప్రిన్సిపాల్ నుంచి ఐటీడీఏ పీవో వరకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గొలుగొండ మండలం చంద్రయ్యపాలెంకు చెందిన గోరా ప్రవీణ్ కుమార్ (15) స్థానిక గురుకుల పాఠశాలలో టెన్త్ చదువుతున్నాడు. అనారోగ్యానికి గురైన అతనిని ఈనెల 17న కేజీహెచ్‌కు తరలించారు. ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు అక్కడ ట్రైబల్ సెల్ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తూ చికిత్స అందించారు. అయితే అతని ఊపిరితిత్తులు, మూత్రాపిండాలు, కాలేయం పాడవడం వల్ల శనివారం రాత్రి ఆరోగ్య పరిస్థితి విషమించింది. అత్యవసర వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. అర్ధరాత్రి దాటాక ప్రవీణ్‌కుమార్ మృతి చెందాడు. అతని మరణ వార్తతో స్థానిక గురుకుల పాఠశాలలో, విద్యార్థి స్వగ్రామమైన చంద్రయ్యపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని ఆదివారం ఉదయం స్వగ్రామానికి తీసుకువచ్చారు.

మినీ మేడారంలో రేపటి నుంచి జాతర



జాతరకు ముస్తాబయిన మారాయిగూడెం సమ్మక్క సారలమ్మ గద్దెలు

- మారాయిగూడెంలో కొలువుదీరిన సమ్మక్క సారలమ్మ
- మూడు రాష్ట్రాల సరిహద్దుల నుంచి తరలిరానున్న భక్తజనం

ఎటపాక: మినీ మేడారంగా పేరొందిన మారాయిగూడెం సమ్మక్క సారలమ్మ జాతర రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఆంధ్రా సరిహద్దులోని తెలంగాణ రాష్ట్రం దుమ్ముగూడెం మండలంలోని మారాయిగూడెంలో ఈనెల 27 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు గిరిజన జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు గిరిజన గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ జాతరకు ఆలయ కమిటీ పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది. కార్యక్రమాల వివరాలను వెల్లడించింది. ఈనెల 27న జాతర ప్రారంభం కాగా 28 రాత్రి 10గంటలకు దేవత నిశానులు, సారలమ్మను గుడికి తీసుకు వస్తారు. 29న నిండు జాతర సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు వనదేవతను గుడికి తీసుకొస్తారు. అదేరోజు సాయంత్రం 4గంటలకు తల్లి దేవత గుట్ట నుంచి సమ్మక్కను గుడికి తీసుకొస్తారు. మార్చి ఒకటిన శంకు పండగ దేవుని దర్శనం, రెండున తల్లి దేవత తిరిగి గుట్టకు వెళ్లడంతో జాతర ఉత్సవం ముగుస్తుంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతరలో గిరిజన సంప్రదాయ నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి. ఎటపాక మండలం సరిహద్దున ఉన్న ఈ ఆలయానికి భద్రాచలం ఆర్టీసీ డిపో నుండి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనుంది.

విహారయాత్రలో విషాదం

- బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



పవన్ రత్నాకర్ మృతదేహం

మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని వేజువాడ గ్రామ సమీపం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గుడిస పర్యాటక ప్రదేశాన్ని తిలకించి తిరిగి వస్తుండగా బైక్ అదుపుతప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన సిద్దిరెడ్డి పవన్ రత్నాకర్ (22) విశాఖలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఉదయం తుని వెళ్లిన అతను రాజమహేంద్రవరంలోని స్నేహితుల వద్దకు వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పి మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఇంటి నుంచి బయలుదేరాడు. వీరు పర్యాటక ప్రదేశమైన గుడిస హిల్ టాప్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడి నుంచి ఆదివారం తిరిగి వస్తుండగా వేజువాడ వద్దకు వచ్చేసరికి పవన్ బైకు టైర్ పంక్చర్ అయింది. దీంతో అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని బోదులూరు పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము తెలిపారు.

పొత్తు.. పార్టీ చిత్తుకేనా?

- ఇదేమి నిర్ణయం.. తెలుగు తమ్ముళ్ల నిరసన గళం
- జనసేనకు అనకాపల్లి టికెట్ కేటాయింపుపై గరంగరం

అనకాపల్లి (యలమంచిలి రూరల్): టీడీపీ–జనసేన పార్టీల తొలి విడత అసెంబ్లీ అభ్యర్థుల జాబితా అనకాపల్లి నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లలో తీవ్ర అసంతృప్తి రగిల్చింది. పదేళ్లుగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను కాదని జనసేనకు టికెట్ కేటాయించడం గందరగోళానికి దారితీసింది. ఇప్పటి వరకూ చంద్రబాబే తమకు ఇంద్రుడు, చంద్రుడు అని మాట్లాడినవారు ఇప్పుడు ఏకంగా పార్టీ అధినేత వైఖరినే తప్పుబడుతున్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు పార్టీ టికెట్ వస్తుందని ఆయన అనుచరగణం, టీడీపీ శ్రేణులు భావించాయి. కాని అనూహ్యంగా ఈ సీటును పొత్తుల్లో భాగంగా జనసేనకు కేటాయించడంతో ఆదివారం కశింకోట, అనకాపల్లి పట్టణాలలో తెలుగు తమ్ముళ్ల నిరసనలు పెల్లుబుకాయి. చంద్రబాబు తీరుపై ఆ పార్టీ నేతలే తీవ్రస్థాయిలో దుమ్మెత్తిపోస్తున్నారు. నెల రోజుల కిందట జనసేనలో చేరిన మాజీ మంత్రి కొణతాలను ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలపడం సరికాదంటున్నారు. ఈ మేరకు ఆదివారం కశింకోట మండల టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. తామంతా పీలా వెంటే ఉంటామని, ఆయనకు టికెట్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తామని అధినేతకు హెచ్చరికలు పంపారు. అనకాపల్లిలో కూడా టీడీపీ నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇలాంటి పొత్తుల వల్ల పార్టీకి నష్టమే తప్ప ప్రయోజనం ఉండదని, పార్టీకి అనుకూలంగా వున్న సీటును జనసేనకు ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్నారు. నమ్మకాన్ని వమ్ము చేయడమే చంద్రబాబు నైజమని సొంత పార్టీ నేతలే విమర్శిస్తూ మీడియా సమావేశాలు నిర్వహించడం, సామాజిక మాధ్యమాల్లో వీడియోలను పోస్టు చేయడం టీడీపీ శ్రేణుల్లో తీవ్ర నైరాశ్యాన్ని తెచ్చింది. చంద్రబాబుకు మాటపై నిలబడే తత్వం లేదని, ఆయన మాటలకు, చేతలకు పొంతన లేదని నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.

పార్కింగ్ సమస్య పరిష్కారం



గతంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో వాహనాలు

- బొర్రా గుహల వద్ద పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- అధికార యంత్రాంగం కసరత్తు
- పార్కింగ్ రుసుం పక్కదోవ పట్టకుండా ఆన్‌లైన్‌లో అనుసంధానం
- ఫాస్ట్ ట్యాగ్ విధానంలో వసూలు



పార్కింగ్ రుసుం వసూలుకు సిద్ధం చేసిన యంత్రం

అనంతగిరి: బొర్రాగుహల వద్ద ఒకపక్క ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తూనే మరోపక్క ఆదాయాన్ని క్రమబద్ధీకరించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. మన్యంలోని పర్యాటక ప్రాంతాల్లో బొర్రాగుహలకు ఓ ప్రత్యేకస్థానం ఉంది. వీటిని తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి ఏటా లక్షల సంఖ్యల్లో పర్యాటకులు వస్తుంటారు. సొంత వాహనాలు, ప్రైవేటు వాహనాలు, బస్సుల్లో వస్తున్న వీరు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోడ్లపైనే నిలిపివేసేవారు. దీంతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను స్థానిక సర్పంచ్ అప్పారావు, ఎంపీడీవో శ్రీహర్షితగత కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు పంచాయతీ ఆధ్వర్యంలోని ఐదుచోట్ల వాహనాలు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటుచేశారు. 2022 డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో పార్కింగ్ రుసుం వసూలు బాధ్యతను పంచాయతీకి అప్పగించింది. అప్పట్లో సుమారు రూ.3 లక్షల మేర ఆదాయం వచ్చింది. ఈ నిధులను పారిశుధ్యం మెరుగుతోపాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పించి వేతనాలు చెల్లించేందుకు ఉపయోగించేవారు. ఆ తరువాత నిలిచిపోయింది.

ఆన్‌లైన్ టికెట్ యంత్రం ఏర్పాటు

బొర్రా గుహలకు వచ్చే వారితో మళ్లీ పార్కింగ్ సమస్య పునరావృతం కావడంతో ఎంపీడీవో శ్రీహర్షిత్ ఇటీవల కలెక్టర్ (గత) సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను వివరించారు. ఆయన ఆదేశాల మేరకు మండల పరిషత్ ఆధ్వర్యంలో పార్కింగ్ రుసుం వసూలు గేటు ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానించారు. అనంతరం ఆన్‌లైన్ టికెట్ యంత్రాన్ని ప్రారంభించారు.

అక్రమాలకు తావులేకుండా..

అక్రమాలకు తావులేకుండా సుమారు రూ.లక్షతో బొర్రాలోని బూమ్ గేటును ఏర్పాటు చేస్తున్నారు. ఫాస్ట్ ట్యాగ్ విధానం అందుబాటులో ఉంటుంది.

వాహనాలకు ధరలు	
ద్విచక్రవాహనాలు	రూ.10
ఆటో	రూ.20
కార్లు, జీపులు	రూ.30
బస్సు	రూ.50



సర్వసభ్య సమావేశంలో ఈ టికెట్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు, ఎంపీడీవో, ఎంపీటీసీలు, సర్పంచులు

ఆదాయ వివరాలకు మండల పరిషత్‌కు అనుసంధానం చేశారు. వచ్చే ఆదాయాన్ని బొర్రాలో పారిశుధ్యం మెరుగుకు, గిరి యువతకు ఉపాధి కల్పించి, వేతనాలు చెల్లించేందుకు ఉపయోగించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. గేటు నిర్వహణకు సంబంధించి సుమారు ఐదు మందిని నియమించేందుకు కసరత్తు మొదలు పెట్టారు.

నిరుద్యోగులకు ఉపాధి



పర్యాటకులకు పార్కింగ్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు టోల్‌గేట్ ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడ విధులు నిర్వహించడం ద్వారా కొంతమంది నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వసూలు చేసే రుసుం ప్రతిపైసా కచ్చితంగా ప్రభుత్వానికి జమ అవుతుంది.

– శ్రీహర్షిత్, ఎంపీడీవో, అనంతగిరి

టీడీపీ Vs జనసేన సోషల్ వార్

సోషల్ మీడియా వేదికగా మాటల యుద్ధం







- బానిసలకు 24 ఎక్కువంటూ టీడీపీ శ్రేణుల కవ్వింపు మాటలు
- వెన్నుపోటు పొడుస్తున్నారంటూ జనసేన కార్యకర్తల ఆరోపణలు
- ఇక రెండు జెండాలు మోయలేమంటున్న జనసేన కార్యకర్తలు
- పవన్ కల్యాణ్ వైఖరికో దండం అంటూ పార్టీకి స్వస్తి
- వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగనే సీఎం అని బహిరంగంగా వెల్లడి

తొలి జాబితాతోనే యుద్ధం మొదలైంది.. ఈ యుద్ధం ఎన్నికల క్షేత్రంలో కాదు.. సామాజిక మాధ్యమాల్లో. వైరి శ్రేణుల మధ్య కాదు.. పొత్తు కౌగిల్లో ఉన్న పార్టీల మధ్య. పొత్తుల మాటున చంద్రబాబుకు అలవాటైన వెన్నుపోటుతో జనసేన నాయకులు, కార్యకర్తలు విలవిల్లాడుతున్నారు. మా నాయకుడ్ని సీఎం కుర్చీపై చూస్తామని అనుకుంటే.. ముష్టి విదిలించినట్లు 24 సీట్లు ఇవ్వడంపై జనసేన కార్యకర్తలు జీర్ణించుకోలేక.. ఈ కూలి బతుకులు మాకొద్దంటూ.. పవన్‌కు గ్లాసుకూ ఒక దండం పెట్టేస్తున్నారు. మీ తొత్తు పార్టీకి 24 సీట్లే ఎక్కువ మూసుకొని బానిసల్లా ఉండడమేనంటూ టీడీపీ కార్యకర్తలు కవ్వింపు మాటలతో రెచ్చగొడుతున్నారు. పావలా వంతు కూడా సీట్లు దక్కించుకోలేని జనసేన, పొత్తు పేరుతో బానిస పార్టీలాగానే జనసేనని చూస్తున్న టీడీపీ కార్యకర్తల మధ్య 'సోషల్' యుద్ధం జరుగుతోంది.

సాక్షి, విశాఖపట్నం : 'అన్నా.. ఇన్నాళ్లూ.. నీ మీద నమ్మకంతో జెండా పట్టి కూలీలా పనిచేశాం. రెండు జెండాలు పట్టుకొని తిరుగుదామని పిలుపునిస్తే.. తిరిగాం.. ఇంక మా వల్ల కాదు.. నీ కోసం క్షేత్ర స్థాయిలో మేం రొమ్ము విరుచుకొని పనిచేస్తుంటే.. నువ్వు చంద్రబాబు ఎదుట సాగిలాపడుతూ బాంచన్ దొర అన్నట్లుగా తలూపుతుంటే ఇంకా చూస్తూ తట్టుకోవడం మా వల్ల కావడం లేదు.. ఇక సెలవు అన్నా.. పవన్ అంటే ప్రాణం.. కానీ.. ఓటు మాత్రం వైఎస్ జగన్‌కే వేస్తాం..' అని ఒకరు.

'నీ మీద నమ్మకం పోయిందన్నా.. నీ వెంట నడిచే ఓపిక లేదు.. నడిచే ప్రసక్తే లేదు..' అంటూ మరొక జనసేన కార్యకర్త పవన్‌ని సోషల్ మీడియా వేదికగా తూర్పారబడుతున్నారు.

టీడీపీ, జనసేన సంయుక్తంగా విడుదల చేసిన తొలి జాబితా.. ఆయా పార్టీ శ్రేణుల్లో చిచ్చు రేపుతోంది. టీడీపీ, జనసేన శ్రేణులు ఒకరిపై ఒకరు సోషల్ మీడియాలో కత్తులు దూసుకుంటున్నారు. మాటల తూటాలతో యుద్ధం చేసుకుంటున్నారు. 2024లో కచ్చితంగా పవన్‌ని ముఖ్యమంత్రిగా చూస్తామని ఇన్నాళ్లూ కలలు కన్న జనశ్రేణులు.. అవన్నీ పగటి కలలని తేలడంతో.. ఏం చేయాలో పాలుపోని దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారు. ఒక్కొక్కరుగా.. పార్టీకి ఇన్నాళ్లూ సేవలు చేసినా.. చివరికి బానిసల్లా పవన్ కల్యాణ్ మార్చేశారంటూ ఆవేదనతో జనసేనకు గుడ్‌బై చెబుతున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు.

ఇలాంటి పొత్తులతో ఓట్ షేరింగ్ జరిగే ప్రసక్తే లేదనీ.. రాబోయే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అవుతారని బల్లగుద్దీ మరీ పోస్టుల్లో చెబుతున్నారు. వీటిని సహించలేని కొందరు జనసేన పార్టీ నాయకులు.. ఎప్పటిలాగానే.. వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిని కోవర్టులంటూ బూతు పురాణాలు లంకిస్తున్నారు. దీంతో.. సామాజిక మాధ్యమాల్లో జనసేన కార్యకర్తలు, నాయకులు రెండుగా చీలిపోయారు. కొందరు పవన్ ఏం చేసినా తప్పదు. ఆయన వెంటే నడుస్తామని నైరాశ్యంతో చెబుతుంటే.. సింహభాగం నాయకులు, కార్యకర్తలు మాత్రం.. చంద్రబాబు, లోకేష్‌తోపాటు పవన్‌నీ తిడుతూ.. ఈసారి వైఎస్ జగన్‌కే మా ఓటు.. ఆయనే సీఎం అని బాహాటంగానే తమ నిర్ణయాన్ని వ్యక్తం చేసే వర్గంగా విడిపోయారు.

జనసేనని ఆటాడుకుంటున్న టీడీపీ

మరోవైపు సీట్ల కేటాయింపుతో నిరాశ నిస్పృహలకు లోనైన జనసేన కార్యకర్తలు, నాయకులతో టీడీపీ శ్రేణులు ఆటాడుకుంటున్నాయి. పావలా బతుకులకు 24 సీట్లే ఎక్కువనీ.. ఇచ్చిన సీట్లన్నీ గెలిపించుకోగలరా అంటూ సవాల్ విసురుతున్నారు. మరికొందరు ఒకడుగు ముందుకెళ్లి.. చంద్రబాబు లేదా లోకేష్ సీఎం అవుతారు తప్ప.. పవన్‌కు డిప్యూటీ సీఎం పదవి కూడా ఇచ్చే ప్రసక్తే లేదంటూ ఎద్దేవా చేస్తున్నారు. ఇంకొందరైతే.. ముందు ఎమ్మెల్యేని చెయ్యండి.. తర్వాత సీఎంని చేసే ఆలోచన దగ్గరకు రండి అంటూ రెచ్చగొట్టే ధోరణితో మాట్లాడుతుండటంతో.. జనసేన సోషల్ మీడియా కార్యకర్తలు రగిలిపోతున్నారు. అనవసరంగా చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు మద్దతునిచ్చి పవన్ తప్పు చేశారనీ.. లేదంటే.. అచ్చెన్నాయుడు చెప్పినట్లు ఈ సమయానికి పార్టీ లేదు.. బొ-- లేదు అనే మాటే నిజమై ఉండేదని సమాధానమిస్తున్నారు. ఇలా.. రెండు రోజులుగా ట్విటర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో టీడీపీ, జనసేన మధ్య సోషల్ వార్‌నడుస్తోంది.

నేత్రపర్వంగా వెంకన్న పెళ్లి రాట

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 20వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వార్షిక తిరుకల్యాణోత్సవాలకు సంబంధించి పెళ్లిరాట వేసే కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయంలో ధ్వజస్తంభ ప్రాంగణంలో ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో అర్చక స్వాములు సంకర్షణ పల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకట శేషాచార్యులు ఈ కార్యక్రమాన్ని వైదిక సంప్రదాయబద్ధంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాఘ బహుళ పాడ్యమి, పుబ్బ నక్షత్ర యుక్త మేషలగ్నంలో ఉదయం 10.14 నిమిషాలకు రాట వేసే తంతును పూర్తి చేశారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, నిత్యార్చనలు కొండదిగువ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు ఆండాళ్లమ్మ వారికి నిత్యార్చనలు పూజలు నిర్వహించారు. అనంతరం పెళ్లిరాట వేసే కార్యక్రమాన్ని ఘనంగా చేశారు. వచ్చే నెల 20వ తేదీ నుంచి ఐదు రోజులపాటు స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన అంకురార్పణ 19న జరగనుంది. కార్యక్రమంలో భాగవతం రాజగోపాలాచార్యులు, దేవస్థానం ఇన్‌స్పెక్టర్ వెంకట కూర్వేశ్వరరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పాడగట్ల పాపారావు, వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, శ్రీపాద ప్రణవ్, సర్పంచ్ ప్రగడ వీరబాబు, పెంకులరాజు, ఆకేటి గోవిందరావు, నూకతాత, నున్న సుభాస్, గోర్స శ్రీనివాస్, రేజేటి సింగాచార్యులు, యూవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంప్ చెన్నై

విశాఖ స్పోర్ట్స్: ఆలిండియా మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంపియన్‌షిప్‌ను చెన్నై పోర్ట్ కైవసం చేసుకుంది. ట్యూటికోరిన్ పోర్ట్ జట్టు రన్నరప్‌గా నిలవగా డిఫెండింగ్ చాంప్ హోదాలో బరిలోకి దిగిన ముంబై పోర్ట్ జట్టు సెకండ్ రన్నరప్‌గా సరిపెట్టుకుంది. విశాఖ పోర్ట్ ఇండోర్ స్టేడియంలో జరిగిన టైటిల్ పోరులో చెన్నై పోర్ట్ జట్టుకు ట్యూటికోరిన్ పోర్ట్ జట్టు గట్టి పోటీ ఇచ్చింది. హోరాహోరీగా సాగిన టైటిల్ పోరులో (53–48) ఐదు పాయింట్ల తేడాతో చెన్నై పోర్టు జట్టు విజయాన్నందుకుంది. జట్టు తరఫున దినేష్ 10, స్టువర్ట్ 20, కామేశ్వరన్ 15 పాయింట్లు సాధించి జట్టుకు టైటిల్ అందించారు. ఈ టోర్నీలో బెస్ట్ రైడర్‌గా ఎస్.భరత్(ట్యూటికోరిన్), బెస్ట్ ఆటగానిగా సౌరబ్‌రౌత్(ముంబై) బెస్ట్ ఆల్‌రౌండర్‌గా దినేష్‌కుమార్(చెన్నై పోర్ట్) నిలిచారు. పోటీల ముగింపు కార్యక్రమంలో వీపీటీ సీఏఓ ఎస్.శివకుమార్, వీపీఏ డిప్యూటీ చైర్మన్ డి.దుర్గేశ్ కుమార్ హాజరై విజేతలకు ట్రోఫీలందించారు.

ఎస్ఐపై మందుబాబు వీరంగం

బీచ్‌రోడ్డు(విశాఖ): తన బంధువుల ద్విచక్ర వాహనం ఆపినందుకు ఓ ఎస్ఐపై మందుబాబు దురుసుగా ప్రవర్తించాడు. మూడో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ మనోహర్ బీచ్‌రోడ్డులో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఎస్ఐను వైఎస్సార్ విగ్రహం వద్ద మందుబాబు నిలిపివేశాడు.

వాహనం ముందు చక్రాన్ని తన రెండు కాళ్ల మధ్యలో పెట్టి కదలనివ్వకుండా చేసి.. తన బంధువుల వాహనం ఎందుకు ఆపావు అంటూ దుర్భాషలాడాడు. నువ్వు పోలీసు అయితే నాకేంటి.. నీ అంతు చూస్తా అంటూ వార్నింగ్ ఇచ్చాడు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మందుబాబును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

పీవీటీజీలకు పెద్ద పీట

- వైఎస్సార్‌సీపీ అరకులోయ సమన్వయ కర్త రేగం మత్స్యలింగం



ప్రభుత్వ పథకాల గురించి పీవీటీజీ మహిళలకు వివరిస్తున్న రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల మంజూరు, పదవుల కేటాయింపులో వెనుకబడిన ఆదిమజాతి గిరిజను (పీవీటీజీ)లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త, హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం అన్నారు. ఆదివారం శిరగాం పంచాయతీ మారుమూల లంతంపాడు, దిబ్బవలస గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆదిమజాతి గిరిజనులతో మమేకమై, వారి కష్టాసుఖాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గ్రామాల్లోని సుమారు 180 గడపలకు వెళ్లి అవ్వాతాతలతో మాట్లాడి పింఛన్ అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రేషన్ సరుకులు, చిన్నారులకు అంగన్‌వాడీ ద్వారా అందుతున్న సరుకుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మత్స్యలింగం మాట్లాడుతూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవిని పీవీటీజీకి చెందిన జల్లిపల్లి సుభద్రకు కేటాయించారన్నారు. అరకులోయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కిల్లో రాజరమేష్‌ను నియమించారని, ఎంతో మందికి ఎంపీటీసీ సీట్లు కేటాయించి గెలిపించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసేందుకు అంతా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరావు, ఎంపీటీసీ శత్రుఘ్న, నాయకులు స్వాభి రామచందూర్, రామూర్తి, గరం పూర్ణ, స్వాభి ఏలేషు, గెన్ను, పంచాయతీ నాయకులు ప్రసాద్, జగ్గారావు, బి. అరుణ, జి. సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలతో కోలుకుంటున్న విద్యార్థిని



కేజీహెచ్‌లోని విద్యార్థినిని పరామర్శిస్తున్న హెచ్‌ఎం

అనంతగిరి: కాళ్లు,చేతుల వాపులతో అస్వస్థతకు గురైన స్థానిక గిరిజన సంక్షేమ బాలికల-1 పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థిని తాంగుల జాష్మమేరికి మెరుగైన వైద్యం అందజేయడంతో కోలుకుంటోంది. ఈనెల 17న విద్యార్థిని ముఖం, కాళ్లు,చేతులు వాచిపోవడాన్ని గుర్తించిన హెచ్‌ఎం విమలకుమారి వెంటనే పాడేరు ఆస్పత్రికి తరలించారు. ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ సమాచారం అందజేయడంతో ఐటీడీఏ పీవో అభిషేక్ ఆస్పత్రిలో విద్యార్థిని పరామర్శించి, ఆరోగ్యపరిస్థితి గురించి అడిగితెలుసుకున్నారు. విద్యార్థినికి రక్తపరీక్షలు చేయగా రక్తం 5 గ్రాములే ఉన్నట్టు గుర్తించి, మెరుగైన వైద్యసేవల కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించడంతో పాటు ఆమెకు అవసరమైన రక్తాన్ని అందించే ఏర్పాట్లు చేశారు. విశాఖ కేజీహెచ్‌కు హెచ్‌ఎం విమలకుమారి ఆదివారం వెళ్లి విద్యార్థిని ఆరోగ్యంపై వాకబు చేశారు. ఆరోగ్యం మెరుగుపడిందని, హార్ట్‌లోని రంధ్రం ఉండడంతో ఆపరేషన్ నిమిత్తం కేజీహెచ్ నుంచి రెండు రోజుల్లో తిరుపతి తరలిస్తున్నట్టుగా వైద్యులు చెప్పారని హెచ్‌ఎం తెలిపారు.

విశాఖ మ్యూజియం అద్భుతం

దాబాగార్డెన్స్(విశాఖ): మిలాన్ 2024 సందర్భంగా ఇటీవల ఆధునికీకరించిన విశాఖ మ్యూజియాన్ని కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదివారం సందర్శించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా సాగర తీరంలో ఇటీవల చేపట్టిన ప్రాజెక్టుల్లో భాగంగా విశాఖ మ్యూజియంను ఆధునికీకరించిన సంగతి విదితమే. కళాకారులు రూపొందించిన క్రాఫ్ట్స్, ఆర్ట్స్‌ను అధికారులు పరిశీలించారు. సంస్కృతీసంప్రదాయాలకు అద్దం పట్టేలా తీర్చిదిద్దిన కళారూపాలు, విశాఖ అందాలతో కూడిన చిత్రాలు, ప్రాచీన శిల్పకళా నైపుణ్యంతో కూడిన దేవతామూర్తుల విగ్రహాలు పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. చారిత్రక విశేషాలతో కూడిన గ్రంథాలు, రికార్డులు చూశారు. ఇంటక్ సభ్యుడు వి.ఎడ్వర్డ్ పాల్ విశాఖ చరిత్రకు సంబంధించిన వస్తువులు,చిత్రాలగూర్చి కలెక్టర్‌కు వివరించారు. హెరిటేజ్, ఆర్కియాలజీ మ్యూజియంలో పలు చోట్ల వస్తువులకు సంబంధించిన సమాచారం ప్రదర్శించమని మ్యూజియం క్యూరేటర్ వెంకటరమణకు వివరించారు. అనంతరం అర్బన్ స్కెచర్స్‌కి సంబంధించి వైజాగ్ స్కెచర్స్ బృందం విశాఖ మ్యూజియం ఆవరణలో చిత్రీకరించిన చిత్రాలను తిలకించిన కలెక్టర్ మల్లికార్జున.. ప్రీతి సంగీత, పీపీ హనుమంతు బృంద సభ్యులను అభినందించారు.

అందరి సహకారంతో అభివృద్ధి సాధ్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



భవనానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు:అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. ముంచంగిపుట్టులో గిరిజన ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. అసంపూర్తిగా ఉన్న ఈ భవన నిర్మాణానికి జెడ్పీ చైర్ పర్సన్ ప్రత్యేక చొరవతో జెడ్పీ నిధులు రూ.5లక్షలు మంజూరయ్యాయి. దీంతో పనులు పునఃప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మండలంలో గిరిజన ఉద్యోగులకు పక్కా భవనం కల్పించాలని ఉద్దేశంతో జెడ్పీ నుంచి నిధులు కేటాయించినట్టు చెప్పారు. నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ముంచంగిపుట్టు మండలంలో జెడ్పీ నిధులతో పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రానున్న రోజుల్లో మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. భవనానికి నిధులు కేటాయించడంతో హర్షం వ్యక్తం చేస్తూ గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు జెడ్పీ చైర్ పర్సన్ సుభద్రను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచులు సుభాష్‌చంద్ర, నరసింగరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, గిరిజన ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు గోపి, కార్యదర్శి మాలయ్య, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా సభ్యులు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు రాంప్రసాద్, మూర్తి, తిరుపతి, పద్మారావు, రామ్మూర్తి తదితరుల పాల్గొన్నారు.

ఘనంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా విర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకుడు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదంని అర్చకులు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజని నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

అమృత ఆహారంతో ఆరోగ్యకర జీవనం

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



విత్తనాలను పరిశీలిస్తున్న జియ్యాని శ్రీధర్

సింహాచలం: అమృత ఆహారం పండించి ఆరోగ్యంగా జీవించాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ దారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలకు అంట్లు కట్టే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న శ్రీధర్ మాట్లాడుతూ కూరగాయల మొక్కలకు అంట్లు కట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. అలాగే గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ దారుల సంఘం ద్వారా జీవామృతం, మట్టి, దేశీయ ఆవుల ఎరువు, కూరగాయల మొక్కల నారు విత్తనాలు పంపిణీ చేయడం చాలా అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ రైతులకు చేయూత ఇవ్వడం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ దారుల సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ, కార్యదర్శి సీహెచ్.అశోక్, కోశాధికారి సాయిబాబు, రాష్ట్ర ప్రతినిధి పీఎల్ఎస్.రాజు, వ్యవసాయ సైంటిస్ట్ అశోక్‌కుమార్, సంస్థ ప్రతినిధులు పోదీశ్వర్ పురోహిత్, చిన్న పిల్లల వైద్య నిపుణులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎనిమిది రకాల వంగ నారు, నాలుగు రకాల టమాటో నారు, పచ్చిమిర్చి, ఉల్లి, బంతి నారు, ఫ్యాషన్ డ్రైఫ్రూట్, అడవి ఆనబకాయ, కరక్కాయ, సబ్జా తదితర విత్తనాలను పంపిణీ చేశారు.